


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 11.12.2025 | సంపుటి : 2 | సంచిక :306 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 11.12.2025 | volume : 2 | Issue : 306 | Pages : 8 | Cost : 2/- |

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

**కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి**

**బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం**

హైదరాబాద్, డిసెంబర్ 10 : తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన

-మిగతా 2 లో..




# ప్రపంచ స్థాయిలో గూగుల్ అగ్రస్థానం

**సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం**

**స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు**


**గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్**

హైదరాబాద్, డిసెంబర్ 10 : హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన

-మిగతా 2 లో..

# నేడే తొలివిడుత పోలింగ్

**పంచాయతీ ఎన్నికలకు సర్వంసిద్ధం**




- తొలి విడతలో మొత్తం 189 మండలాలు 02
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్

# ఫోన్ ట్యాపింగ్.. గురువారం విచారణ

న్యూఢిల్లీ,డిసెంబర్10 : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుప్రీంకోర్టులో గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి ఒక ముఖ్య విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తు సంస్థతో ఏమాత్రం సహకరించడం లేదని, దర్యాప్తు సంస్థతో ఆయన ఆటలాడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, కీలకమైన ర-ుజువులను

-మిగతా 2 లో..



# అన్‌క్లెయిమ్డ్ మనీ మీ సొంతం

**అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి.. ప్రధాని మోడీ మరోమారు పిలుపు**

**అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు.**



న్యూఢిల్లీ, డిసెంబర్ 10 : క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు'

-మిగతా 2 లో..

# గ్లోబల్ సమ్మిట్ అట్టర్‌ఫ్లాప్

**కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు.**



హైదరాబాద్, డిసెంబర్ 10 : అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్

-మిగతా 2 లో..



02

## ఆరోపణలకు ఆధారాలతో సహ సమాధానమిస్తా..

మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత




## ఓయూకు 1000 కోట్లు

02

- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా..చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

# రెండేళ్లలో రూ.1,685.79 కోట్ల సీఎంఆర్‌ఎఫ్

## సిఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

హైదరాబాద్, డిసెంబర్ 10 :తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్దిదారులకు రూ.1,685.79 కోట్ల సహాయం అందజేశారు. గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ.850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి

-మిగతా 2 లో..



# గ్లోబల్ సమమిట్‌తో ఊహించని పెట్టుబడులు

**పేరెన్నిక గన్న కంపెనీలతో పలు ఒప్పందాలు**

**ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు**

**త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం**

**మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, డిసెంబర్ 10 : గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు

-మిగతా 2 లో..





## సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం

02

- కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు
- యువకుడిని పిలిపించి దారుణంగా హత్య

# నేడే తొలివిడత పంచాయితీ పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల పక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల పక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో ఆబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్



స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్డ్ ఆయుధాల డిపాజిట్, రూ.7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

## 'మీ డబ్బు.. మీ హక్కు'

(మొదటిపేజీ తరువాయి)



రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు.

## గ్లోబల్ సమమిట్‌తో ఊహించని పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)



జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత – బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు

### సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం

**సంగారెడ్డి, డిసెంబర్ 10:** సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును ప్రేమించాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని అతడిని ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిడిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ కుటుంబం ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందామని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మ గూడలోబి సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించుకోకపోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. హతమార్చారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్,



ఇన్నోవేటివ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకువెళ్లాలని సూచించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు నేటికి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రభాకర్ రావు తన ఐక్లౌడ్‌లోని డేటాను డిలీట్ చేశారని కూడా న్యాయస్థానానికి వెల్లడించారు. అయితే, ప్రభాకర్ రావు తరపు సీనియర్ న్యాయవాది ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో, ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కీలక కేసులో విచారణ రేపు కూడా కొనసాగనుంది.

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్ చేశారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ ÷–లబెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్మకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్' అంటూ హరీష్ రావు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## ఆర్టీసీకి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

(మొదటిపేజీ తరువాయి)




హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు తిరుగుతున్నాయి.జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవు తాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగులు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన ఆల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజారవాణాలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నగర ప్రజలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎం సహాయనిధి పంపిణీలో కొత్త రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్ధిదారులకు రూ.533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం పక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్ధిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది. తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ.1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అఫీఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తున్న ఈ సహాయ నిధి, అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం



**హైదరాబాద్, డిసెంబర్ 10 :** ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలు చున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతం గా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడుతున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థుల కు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడు తుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్ర తను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ జర్మనీ పర్యటన

- బిజెపి విమర్శలపై ప్రియాంక ఎద్దేవా
- మోడీ సగం పనిదినాలు విదేశాల్లోనే అంటూ విమర్శలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10 :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగుతుండగా.. రాహుల్ విదేశీ పర్యటనపై బిజెపి నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. రాహుల్ ఈజ్ ఎల్ఓపి అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ పేరుతో కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ స్పందించారు. దేశ ప్రధాని మోడీ సగం పనిదినాలు దేశం బయటే గడుపుతున్నారని బిజెపి నేతలకు కౌంటర్ ఇచ్చారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాహుల్ గాంధీ జర్మనీలో భారతీయులతో భేటీకానున్నారు. ఈ పర్యటనలో ఆయన జర్మనీ మంత్రుల్ని కూడా కలవనున్నారు. రాహుల్ ఈజ్ ఎల్వోపీ అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ అని బీజేపీ పేర్కొన్నది. విదేశీ నాయకుడు తన నచ్చిన అంశాన్ని చేస్తున్నారని, విదేశీ టూరుకు వెళ్తున్నారని, శీతాకాల పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 19వ తేదీ వరకు ఉన్నాయని, కానీ రాహుల్ గాంధీ మాత్రం డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీకి వెళ్తున్నట్లు బిజెపి ప్రతి ఒనిధి షెహజాద్ పూనావాలా తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలోనూ రాహుల్ విదేశాల్లో ఉన్నారని, జంగిల్ సఫారీ చేసినట్లు ఆరోపించారు.పర్యటనపై అనేక విమర్శలు వస్తున్న సమయంలో.. ప్రియాంకా గాంధీ స్పందించారు. దేశం బయటే తన సగం దినాలను ప్రధాని మోదీ గడిపేస్తున్నారని, మరి ప్రతిపక్ష నేతపై ఎందుకు ప్రశ్నలు వేస్తున్నారని ప్రియాంకా కౌంటర్ ఇచ్చారు. జర్మనీ టూరులో రాహుల్ గాంధీతో, కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామ్ పిట్రోడా కూడా వెళ్తున్నారని బల్వీందర్ సింగ్ తెలిపారు.

## ఎన్డీయే ఎంపీలకు నేడు మోడీ విందు

**ఉభయ సభల్లో వ్యూహంపై చర్చించే అవకాశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 10 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎంపీలకు తన నివాసంలో ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఈ విందు సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ఉభయసభల్లో పరస్పర సహకారం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పటిష్ఠం చేయడంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. ఎన్డీయే విస్తృత ఎజెండా, ప్రస్తుత సమావేశాల్లో ప్రభుత్వ ఎజెండాపై ప్రధాని ఈ సమావేశంలో ఎంపీలతో ప్రస్తావిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ పక్రియ అంశం కూడా విందు సమావేశంలో ప్రస్తావనకు రావచ్చని తెలుస్తోంది. సీనియర్ మంత్రులు, లీడర్లు, భాగస్వామ్య పార్టీల ఎంపీలు ఈ విందులో పాల్గొంటారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాల కోసం అనుసరించాల్సి వ్యూహంపై కూడా ఎన్డీయే భాగస్వాములతో చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. శ్చిమబెంగాల్‌లో ఇప్పటికే పార్టీ సంస్థాగత కార్యక్రమాలను బీజేపీ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా డిసెంబర్ 20న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటిస్తారని, నడియా జిల్లాలో పబ్లిక్ ప్రోగ్రాంలో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ నాయకత్వంతో వ్యూహాత్మక సమావేశాలను కూడా మోదీ నిర్వహించనున్నారు. సంస్థాగత సన్నద్ధతను సమీక్షించనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పశ్చిమబెంగాల్‌లో నాలుగు నుంచి ఆరు పరివర్తన్ యాత్రలు నిర్వహించేందుకు కూడా బీజేపీ సన్నాహాలు చేస్తోంది. మోదీ స్వయంగా ఒక యాత్రలో పాల్గొంటారు.

## తొలివిడత పంచాయితీకి భారీ బందోబస్తు

**రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, డిసెంబర్ 10 :** తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాల పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లుచేసిందన్నారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

## ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్ 10 :** ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

## మత్తు ఇంజెక్షన్ల వ్యవహారంలో పురోగతి

**ప్రైవేట్ డాక్టర్ల మత్తు వ్యాపారం గుర్తింపు**

**హైదరాబాద్, డిసెంబర్ 10 :** హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట పరిధిలో మత్తు ఇంజెక్షన్ల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. మత్తుకోసం అనస్తీషియా తీసుకుని ఇద్దరు డ్రైవర్లు మృతిచెందడంతో పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు డాక్టర్లను అరెస్ట్ చేశారు. రోగులకు ఇవ్వాల్సిన డోసు కంటే ఎక్కువ మోతాదులో మత్తు ఇచ్చినందువల్లే వారు మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు ఆటోడ్రైవర్లు ఆటోలనే కుప్పకూలి మరణించడంతో.. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా విశ్లేషించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఇంజెక్షన్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశంపై పలు ఆధారాలు సేకరించారు. రోగులకు చికిత్స చేసేందుకు వాడాల్సిన మత్తు ఇంజెక్షన్లను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జైపాల్ రెడ్డి బహిరంగ మార్కెట్లో అక్రమంగా అమ్ముతున్నాడు. అతడి వద్ద నుంచి ఈ ప్రమాదకర ఇంజెక్షన్లు బయటకు వెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో మరో ఆసుపత్రికి చెందిన ఇంకో వైద్యుడి పాత్ర కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఇరువురూ కలిసి అక్రమంగా అనస్తీషియా ఇంజెక్షన్లు విక్రయిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఆసుపత్రుల్లో నిల్వ ఉన్న ఔషధాలను దారిమళ్లించి.. మత్తుకు అలవాటుపడిన వారికి అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు.

## ఆరోపణలకు ఆధారాలతో సహా సమాధానమిస్తా

- ఫ్రస్టేషన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, డిసెంబరు 10 :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫ్రస్టేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటాలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూల్లోనే అంగన్‌వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్‌షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

# జనావాసాల్లో చిరుత దాడి

**దాడిలో ఏడుగురికి గాయాలు**

**ముంబై, డిసెంబర్ 10 :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలో బుధవారం చిరుత సంచారం కలకలానికి దారి తీసింది. శివ్‌నగర్ ప్రాంతంలో జనావాసాల్లోకి చిరుత దూసుకురావడంతో స్థానికులు కంగారు పడిపోయారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో సుమారు ఏడుగురు గాయపడ్డారు. అయితే, ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు ఉదయం 7.30 గంటలకు చిరుత సంచారం గురించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిందని హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధికారి మీడియాకు తెలిపారు. దీంతో, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆదేశాల మేరకు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్.. ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ సెంటర్ బృందాన్ని ఘటనా స్థలానికి పంపించారు. ఉదయం 9.30 గంటల సమయంలో రంగంలోకి దిగిన సిబ్బంది చిరుతకు మత్తు మందు ఇచ్చి బంధించారు. గంటసేపట్లో ఈ ఆపరేషన్ పూర్తయ్యింది. అటవీ శాఖ సిబ్బంది చిరుతను ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ కేంద్రానికి తరలించారు. అది మగ చిరుత అని, సుమారు మూడేళ్ల వయసు ఉంటుందని తెలిపారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. జనావాసాల మధ్యకు వచ్చిన చిరుత భవంతుల మధ్య దూకుతూ ఇబ్బంది పడింది. ఓ భవనంపై నుంచి మరోచోటుకు దూకే ప్రయత్నంలో పట్టుకోల్పోయి గోడను పట్టుకుని వేళ్లాడింది. కాసేపు శ్రమించి చివరకు భవనంపైకి చేరుకుంది. చుట్టుపక్కల వారందరూ మేడలపైకి ఎక్కి ఈ సన్నివేశాలను ఆశ్చర్యపోతూ చూశారు. చిరుతను బంధించామని, స్థానికులకు అపాయం తప్పిపోయిందని మహారాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేశ్ నాయక్ తెలిపారు. ఆ ప్రాంతంలో చిరుత మళ్లీ కనబడితే ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులు స్థానికులను అప్రమత్తం చేస్తారని అన్నారు. చిరుత దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తాను సందర్శించానని, వారికి ఎలాంటి అపాయం లేదని తెలిపారు

## నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో బాణసంచా నిషేధం

**గోవా ప్రభుత్వం సంచలన నిర్ణయం**

**పనాజి, డిసెంబర్ 10 :** నూతన సంవత్సర, క్రిస్మస్ వేడుకలకు గోవా సిద్ధమవుతున్న తరుణంలో నైట్ క్లబ్ అగ్నిప్రమాద ఘటన కలకలానికి దారి తీసింది. ఈ ఘటనలో 25 మంది మృతి చెందడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో రానున్న హాలిడే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని గోవా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో బాణసంచాను నిషేధించింది. ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. సంప్రదాయక బాణసంచాతో పాటు ఎలక్ట్రానిక్ ÷ర్ వర్క్స్, నిప్పుతో చేసే ఇతర ప్రదర్శనలు, ÷ర్ గేమ్స్‌ను నిషేధించినట్టు గోవా ప్రభుత్వం వెల్లడించింది. క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో గోవాకు పర్యాటకుల తాకిడి పతాకస్థాయికి చేరనున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిషేధం విధించినట్టు వెల్లడించింది. డిసెంబర్ 6న జరిగిన నైట్ క్లబ్ అగ్నిప్రమాదం తరువాత పర్యాటక రంగంలో ఆందోళన రేకెత్తిన నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ బుధవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భద్రతా వ్యవస్థల బలోపేతం, నిబంధనల అమలుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇటీవల నైట్ క్లబ్ అగ్నిప్రమాదం తరహా దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అన్ని డిపార్ట్‌మెంట్‌లు, టూరిజం రంగ సంస్థలు ఈ విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

## జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల పేరుతో రూ.కోటి వసూలు

**హైదరాబాద్:** మూసారాంబాగ్‌లోని ఓ సంస్థ జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిందని పలువురు బాధితులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 50 మంది నుంచి రూ.కోటికి పైగా వసూలు చేశారని ఆరోపించారు. జర్మన్ భాష శిక్షణ, వీసా, వసతి, ఉద్యోగం కల్పిస్తామని చెప్పి మోసం చేశారని బాధితులు వాపోయారు. ఉద్యోగాల కల్పన విషయంలో నెలలు గడిచిన కన్సల్టెన్సీ డైరెక్టర్ స్పందించడంలేదన్నారు. గట్టిగా అడిగితే.. నిర్వాహకులు తమను బెదిరిస్తున్నారని పోలీసులకు తెలిపారు. తాము చెల్లించిన ఫీజులు తిరిగి ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని కన్సల్టెన్సీ డైరెక్టర్ తెలిపారు. తాము కేవలం జర్మనీ లాంగ్వేజిలో శిక్షణ మాత్రమే ఇస్తామని, ఆ విషయం ఫీజు చెల్లించిన రశీదులోనే స్పష్టంగా ఉందని పేర్కొన్నారు.

## ఇండిగో సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

**కేరళ సిపిఎం ఎంపి రహీమ్ విమర్శలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 10 :** ఇండిగో సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని సిపిఐ(ఎం) ఎంపి ఎ.ఎ.రహీమ్ పేర్కొన్నారు.నియంత్రణ లేని ప్రయివేటీకరణ మరియు నిబంధనల సడలింపుల ప్రత్యక్ష పలితమే ఈ సంక్షోభమని అన్నారు. ఇది భారతదేశ విమానయాన రంగాన్ని ద్విధాధిపత్యంగా మార్చిందని అన్నారు. విమానయాన సంస్థకు అనుగుణంగా ÷÷-లట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డిటిఎల్) నిబంధనలను నీరుగార్చవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ సంక్షోభానికి ఇండిగో ఒక్కటే కారణం కాదని అన్నారు. 'ఈ భారీ సంక్షోభం వెనుక ఉన్న ఏకైకక దోషి కేంద్ర ప్రభుత్వం. ఇది ప్రభుత్వ నయాఉదారవాద ఆర్థికవిధనాలు, ప్రైవేటీకరణ మరియు భారతవిమానయాన రంగంపై నియంత్రణ సడలింపుల ప్రత్యక్ష ఫలితం' అని అన్నారు. మార్కెట్ కేంద్రీకరణను సూచిస్తూ.. ఇండిగో ప్రస్తుతం అన్ని విమాన సర్వీసుల్లో 65.6శాతం నిర్వహిస్తుండగా, ఎయిర్ ఇండియా 25.7శాతం నిర్వహిస్తోందని కేరళ ఎంపి అన్నారు. భారతీయ విమానయాన రంగంలో 90శాతం కంటే ఎక్కువ ఇండిగో మరియు టాటా అనే ఈ ఇద్దరు బాస్‌లచే నియంత్రించబడుతున్నాయని అన్నారు. ఎయిరిండియా ప్రైవేటీకరణ విమానయాన సంస్థను మారుస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హామీని ఆయన తోసిపుచ్చారు. భద్రత, సేవల నాణ్యత మరియు విమానాల నాణ్యత పరంగా, పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రభుత్వం రంగం పనికిరానిదని, ప్రైవేట్ సంస్థలు అద్భుతాలు సృష్టించగలవని మోడీ ప్రభుత్వం ఒక అపోహను సృష్టించిందని అన్నారు. ఇండిగో సంక్షోభాన్ని ఎయిర్ ఇండియా దోపిడీ చేస్తోందని అన్నారు. ఇండిగో సంక్షోభ సమయంలో టాటాకి చెందిన ఎయిర్ ఇండియా ప్రజలు పడుతున్న బాధ నుండి లాభం పొందుతోందని విమర్శించారు. 1500 కి.మీ కంటే ఎక్కువ దూరం ఉన్న మార్గాలకు విమాన చార్జీలను రూ.18,000కి పరిమితం చేస్తూ గత శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ.. అదే రోజు ఢిల్లీ-తిరువనంతపురం ఎకానమీ క్లాస్ టికెట్‌కు రూ.64,783 ధరను వసూలు చేసినట్లు బుధవారం ఉదయం గుర్తించానని అన్నారు. ప్రైవేట్ విమానయాన సంస్థలపై ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ లేదన్న అంశాన్ని ఇది హైలెట్ చేస్తోందని అన్నారు. ఫ్‌డిటిఎల్ నిబంధనలను నీరుగార్చవద్దని, ఇండిగోకు మినహాయింపులు ఇవ్వద్దని రహీమ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ద్విధాధిపత్య మార్కెట్లో విమాన ఛార్జీలను నియంత్రించడానికి, ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి బలమైన వ్యవస్థను నియమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, డిసెంబర్ 10 :** అమీర్‌పేటలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. మైత్రీవనంలోని శివమ్ టెక్నాలజీస్ కోచింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కోచింగ్ సెంటర్‌లోని బ్యాటరీలు పేలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తుంది. ప్రమాద సమయంలో వెంటనే కోచింగ్ సెంటర్లలోని విద్యార్థులందరినీ బయటకు పంపించారు.

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్!



**లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యలు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు.**

అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా ఆమె తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు.

ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి.

ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడంలో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో.. పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుం దనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

# వెండి బంగారమవుతోంది

- బంగారంతో పోటీ పడుతున్న ధరలు
- సామాన్యులకు చుక్కలు చూపుతున్న రేట్లు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10 :** నిన్నమొన్నటి వరకు పసిడి గురించి బెంగెట్టుకున్న వారంతా ఇపపుడు వెండిపైనా బెంగపడుతున్నారు. బంగారం లాగే వెండి కూడా బంగారమయ్యింది. వెండి ధరల గురించి చర్చించుకుంటున్నారు. బంగారంతో పాటు ఇన్నాళ్లు పెరిగిన వెండి.. ఇప్పుడు పసిడిని దాటేసి పరుగులు పెడుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఔన్సు 60 డాలర్లు దాటేసింది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వెండి ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం రూ.1.92 లక్షలు పలుకుతోంది. సరిగ్గా ఏడాదిక్రితం తొలిసారి రూ.లక్ష మార్కును దాటిన వెండి.. ఇప్పుడు రూ.2 లక్షల మార్కు దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ విపణిలో గత కొన్ని రోజులుగా 50 డాలర్లు పైన ట్రేడయిన వెండి ఒక్కసారిగా దాదాపు 5 శాతం మేర పెరిగింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, సరఫరాలో అంతరాలు దీనికి కారణమని అనలిస్టులు పేర్కొంటు న్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను పావు శాతం మేర తగ్గిస్తుందన్న అంచనాలు ఈసారి బలంగా ఉన్నాయి. రేట్ల కోత చేపట్టినప్పుడు సాధారణంగా బంగారం, వెండి వంటి లోహాలకు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్ల కోత ప్రకటించాక వీటి రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం ఇంట్లో వస్తువులు, ఆభరణాలకు మాత్రమే వెండిని వినియోగించేవారు. కానీ, పారిశ్రామికంగానూ వెండి అవసరం పెరుగుతుండడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఈవీ కాంపోనెంట్స్‌లో దీని వినియోగం పెరిగింది. అవసరాలకు అనుగుణంగా వెండి ఉత్పత్తి పెరగకపోవడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలోనే గతంలో బంగారం ధర 59 శాతం మేర పెరగ్గా.. వెండి ధర ఏకంగా 107 శాతం మేర పైకెగిసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కిలో వెండి రూ.1.92 లక్షల వద్ద ఉంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. ఆర్నమెంట్‌కు వినియోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.1.20 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,207 డాలర్ల వద్ద ట్రేడవుతోండగా.. వెండి ఔన్సు 61.49 డాలర్లు వద్ద కొనసాగుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో వెండి, బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. వెండి రికార్డు గరిష్టాలకు చేరుకుంది. బుధవారం వెండి కిలోకు ఏకంగా 9000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ఏకంగా రూ. 2, 07, 000కు చేరుకుంది. అనుకున్నట్టుగానే రెండు లక్షలు దాటేసింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 19, 450కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 30, 460కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 19, 600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 19, 450కి చేరింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## ఓరుగల్లులో తొలి విడతకు
# రంగం సిద్ధం

- గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రచారం
- వరంగల్ కమిషనరేట్ నుంచి పర్యవేక్షణ



**వరంగల్, డిసెంబర్ 10 :** ఓరుగల్లులో మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో గురువారం పల్లెపోరు జరగనుంది. ఉమ్మడి ఓరుగల్లులోని ఆరు జిల్లాల్లోని కలెక్టర్లు పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి పోలీస్ బందోబస్త్ పర్యవేక్షిస్తున్నారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఎస్పీలు భద్రతపై ఫోకస్ పెట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. లోకల్‌బాడీ ఎలక్షన్లలో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రచారం మంగళవారం ముగియడంతో ఓట్ల కోసం 11న బ్యాలెట్ పోరు జరగనుంది. వరంగల్ 6 జిల్లాల నుంచి మొదటి విడతలో 555 పంచాయితీలు ఉండగా, 53చోట్ల ఏకగ్రీవాలు కావడంతో మిగతా 502 చోట్ల సర్పంచ్ కోసం పోటీ ఉండనుంది. 1,749 మంది ఇందుకోసం పోటీ పడుతున్నారు. ఇక మొదటి విడతలో 4,952 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, బరిలో 8,676 మంది ఉన్నారు. 981 మంది ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీల గుర్తులు లేకున్నా సర్పంచ్‌బరిలో ఉన్న అభ్యర్థి ఏ పార్టీ మద్దతుదారుడనే విషయంలో క్లారిటీ ఉంది. దీంతో పార్టీల పెద్ద లీడర్లు దీనిని సవాల్‌గా తీసుకోవడంతో చాలా పంచాయితీల్లో ప్రలోభాలు మొదలయ్యాయి. పెద్ద గ్రామ పంచాయతీలు, జనరల్ కోటా రిజర్వేషన్లు ఉన్నచోట ఓటర్లను ప్రసన్నం చేసుకోడానికి జనరల్ ఎలక్షన్ల మాదిరే 'ఓటుకు నోటు' ఫార్ములా అమలు చేస్తున్నారు. దీంతో ఇంటికో కోటర్ సీసాతో పాటు డిమాండ్ మేరకు ఓటుకు రూ.200 నుంచి రూ.500 చొప్పున పంపిణీ చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నారు.

## సాధారణ ఎన్నికలను మించి
# స్థానిక ఎన్నికల ప్రచారం

- హామీలను గుప్పిస్తూ.. సొంత ఎజెండాలతో కరపత్రాలు
- తొలివిడతలో రాత్రివేళ్లలోనూ ఓట్లు అభ్యర్థన




**ఆదిలాబాద్, డిసెంబరు 10 :** గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారంతో తొలివిడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం ఉదయం తొలివిడత ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రారంభంకానుంది. తొలి విడత కింద 6 మండలాల పరిధిలో 166 గ్రామ పంచాయతీలు, 1390 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అభ్యర్థులు ఓటర్ల మద్దతు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సొంతంగా మేనిఫెస్టోలను రూపొందిస్తూ.. ప్రచారం చేపట్టడం విశేషం. ఒప్పంద పత్రాలు, బాండ్ పేపర్లను రాసి ఇస్తున్న వైనం గతంలో ఎప్పుడూ లేదు. వివిధ రకాల ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేస్తున్నారు. ప్రశాంతంగా ముగిసిన తొలివిడత ఎన్నికల ప్రచారం ముగియడంతో రాత్రి వేళల్లో నేరుగా కలుసుకుని ఓటును అభ్యర్థించారు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్లను రాబట్టేందుకు అభ్యర్థులు దేనికైనా తగ్గేదే లేదంటున్నారు. అప్పులు చేసి మరీ ఎన్నికల్లో నెగ్గేందుకు సిద్ధమవుతున్నారు. తొలివిడత ఎన్నికలు జరగే గ్రామాల్లో అభ్యర్థులు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధాన పార్టీల మద్దతుతో గెలిచేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఊరిని బాగు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. అయితే గత పక్షం రోజులుగా సాగిన మొదటి విడత ఎన్నికల ప్రచారం మంగళవారంతో ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, అసంపూర్తిగా ఉన్న ఆలయాలు, కుల సంఘ భవనాల నిర్మాణం పనులపై హామీలు ఇస్తున్నారు. అలాగే తమను గెలిపిస్తే గ్రామాల్లో చేపట్టే పనులకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో జోరుగా వైరల్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం
### ఏకగ్రీవ ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే భేటీ

**వికారాబాద్, డిసెంబరు 10 :** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులతో బుధవారం తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 20 పంచాయతీలు ఏకగ్రీవం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా పాలనలో భాగంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు సదుపాయం, గ్యాస్ సిలిండర్, రుణమాఫీ, రైతు భరోసా, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు పేదలకు అందుతున్నాయన్నారు. పరిగి మీదుగా రైల్వే ట్రాక్ ఏర్పాటుకు సర్వే పూర్తయిందని, త్వరలోనే ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. ప్రజల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు అమలుచేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

## స్కూల్ ఆటో బోల్తాపడి విద్యార్థి మృతి

**కామారెడ్డి, డిసెంబర్ 10 :** స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి పదవ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని సావర్గావ్ గ్రామం నుంచి ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుం డగా ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి ప్రణవ్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రశాంత వాతావరణంలో సర్పంచ్ ఎన్నికలు
### జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత

**జగిత్యాల,డిసెంబర్ 10 :** ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. అధికారుల సూచనలు పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ బీఎస్.లత తెలిపారు. మొదటి విడత మెట్‌పల్లి మండలంలో జరిగే సర్పంచ్ ఎన్నికల ఎన్నికల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పోలీస్ బృందాలను నియమించినట్లు, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను బిగించినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్‌నీతూ, పురపాలక కమిషనర్ మోహన్, తదితరులు ఉన్నారు.

## అందరూ ఓటేయడానికి రండి
### కలెక్టర్ హనుమంతరావు సూచన

**యాదాద్రి భువనగిరి, డిసెంబర్10 :** గ్రామాల్లో ప్రజలకు సేవ చేసే మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటేయడానికి రావాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని అన్నారు. వలిగొండ, ఆత్మకూరు మండలాల్లో ఆయన పర్యటించారు. పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్?ను పరిశీలించారు. అనంతరం స్వీప్ 2025లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని సర్వేపల్లిలో మోడల్ పోలింగ్ బూత్ ని పరిశీలించారు. పోలింగ్ బూత్ ముందు పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు మంచి నీటి సదుపాయం, టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో నాగిరెడ్డి ఉన్నారు.



## ఇందిరమ్మ చీరల్లో కమీషన్ల కక్కుర్తి
### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు

**వరంగల్, డిసెంబర్ 10 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీలో, మహిళా సంఘాల పేరుతో తీసుకున్న రూ.450 కోట్ల రుణంలో కమిషన్లకు కక్కుర్తి పడి అతి పెద్ద కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో నిర్వహించిన సర్పంచి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీల అమలులో విఫలమయ్యారని చెప్పారు. ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ పేరుతో ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన బిడ్డల హక్కులను కాలరాసే ప్రయత్నం చేసిందన్నారు. రైతు బంధు, భరోసా పథకం అమలు చేసి రైతులకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. భారత రాష్ట్ర సమితి సర్పంచి అభ్యర్థి ప్లలెల పావనిని అత్యధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బియ్యాల నళినీదేవి, మాజీ సర్పంచి ఫీర్నాకి రజిత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అనిల్, సోమేశ్వర్ రావు, ధీరజ్ రావు, పలువురు పాల్గొన్నారు.



## ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి సెమీ క్రిస్మస్ వేడుకలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజక వర్గం హాఫిజ్ పేట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో గల ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి సెమీ క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాస్టర్ శ్యాం బాబు, పాస్టర్ రవికుమార్, పాస్టర్ సంగమేష్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాస్టర్ శ్యామ్ బాబు ప్రసంగించారు. అనంతరం కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో సంగం సభ్యులు బస్తీవాసులు పాల్గొన్నారు.



## ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజలకి సేవ చేస్తా

- బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి అలవాల లింగయ్య
- ప్రచారంలో బ్రహ్మారథం పడుతున్న నేలపట్ల ప్రజలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే,ప్రజలకి సేవ చేస్తూ,గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని ఆర్జెసి కళాశాల ప్రిన్సిపాల్,బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి అలవాల లింగయ్య తెలిపారు.కూసుమంచి మండలంలోని నేలపట్ల సర్పంచ్ గా పోటీ చేస్తున్న ఆయన ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలు,మద్దతుదారులతో కలిసి బుధవారం గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ ఉంగరం గుర్తుకి ఓటు వేసి తనను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులో తనకి గ్రామస్తులు బ్రహ్మారథం పడుతున్నారని చెప్పారు.దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుబంధు,రైతు భీమా,కల్యాణ లక్ష్మి,ఉచిత విద్యుత్,మిషన్ కాకతీయ,భగీరథ,రుణమాఫీ,కంటి వెలుగు,అమ్మఒడి, కేసిఆర్ కిట్,ఆరోగ్య లక్ష్మి,ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్, గొర్రెల పంపిణీ వంటి పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టారని వివరించారు.తనను గెలిపిస్తే ప్రభుత్వ పథకాలను గ్రామంలోని ప్రజలందరికీ పారదర్శకం అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.అపర దానకర్ణుడు,పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆశీస్సులతో తన గెలుపు నల్లేరు పై నడకేనని లింగయ్య ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దోమల వెంకులు,చెరుకుపల్లి నాగయ్య, జాల నాగయ్య,నీరుడు సంగయ్య,కొప్పుల గురవయ్య,వార్డు అభ్యర్థులు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధి కోసం బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

- సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు
- ప్రచారంలో దూసుకెళ్తున్న బానోత్ విజయ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మారుమూల గ్రామాలు,పల్లెలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని తిరుమలాయపాలెం మాజీ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు అన్నారు.బిజెపి,సిపిఎం,బిఆర్ఎస్ కూటమి సర్పంచ్ అభ్యర్థిని బానోత్ విజయ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం గ్రామంలో మిత్రపక్షాల కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పంచాయితీ రాజ్ చట్టం - 2018 తీసుకువచ్చి అభివృద్ధికి నోచుకోని తండాలను,పల్లెలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి సిఎం కేసీఆర్ ప్రతి పంచాయతీకి ట్రాక్టర్,ట్యాంకర్,చెత్త సేకరణ రిక్షాలను కేటాయించి గ్రామాల అభివృద్ధికి ఆద్యం పోశారని గుర్తు చేశారు.హరితహరం ద్వారా మొక్కల పెంపకం,అవెన్యూ ప్లాంటేషన్,పల్లె ప్రకృతి వనం వంటి కార్యక్రమాల ద్వారా పల్లెల్లో ఆహ్లాద కరమైన వాతావరణాన్ని కల్పించారని చెప్పారు.అదే రీతిలో గ్రామంలో సమస్యల పరిష్కారానికి,మౌళిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ప్రజలకి అందుబాటులో ఉండే విజయను గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు.గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలు బిఆర్ఎస్ కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని వెల్లడించారు.అన్ని వర్గాల ప్రజల ఆదరణతో విజయ గెలుపు ఖాయమని కొండబాల స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొమ్ము వీరబాబు,చిర్ర చిరంజీవి,నేలమర్రి బాబు,కొమ్ము రాఘవులు,సిపిఎం పార్టీ నాయకులు మద్దినేని శ్రీనివాసరావు,నెరసుల వెంకటేశ్వర్లు,కొమ్ము వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# నిన్నటివరకు ఒక లెక్క... ఇప్పుడు మరో లెక్క...

- పీర్జాదిగూడ సర్కిల్ రాజకీయ నేతల గుండెల్లో గుబులు
- ఒక్కో వార్డుకు సుమారు 40 వేల నుండి 50 వేలమంది ఓటర్లు
- రాజకీయ చదరంగంలో నిలబడేది ఎవరు...? గెలిచేది ఎవరు...?
- రిజర్వేషన్ల చిక్కుముడి వీడితే టికెట్ల వేటలో పరుగులే పరుగులు...
- అధికారికంగా రాజకీయ పార్టీల గుర్తు మీద పోటీ చేస్తే గెలిచే అవకాశం ఎక్కువ
- ఆశావాహుల్లో టెన్షన్... టెన్షన్... సీనియర్ నాయకుల రాజకీయ ముగిసినట్లేనా...?

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ సర్కిల్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. "నిన్నటి వరకు ఒక లెక్క. ఇప్పుడు మరో లెక్క" అన్నట్టుగా ఇక్కడి పరిస్థితులు తారుమారయ్యాయి. మారుతున్న రాజకీయ సమీకరణాలు, అనూహ్యంగా పెరిగిన ఓటర్ల సంఖ్య స్థానిక నాయకుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. రాబోయే ఎన్నికలు సామాన్యంగా ఉండబోవని, ఇది మునుపటి కంటే భిన్నమైన రాజకీయ



చదరంగం కాబోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### భారీగా పెరిగిన వార్డుల పరిధి - అభ్యర్థులకు సవాలు:

గతంతో పోలిస్తే వార్డుల భౌగోళిక స్వరూపం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఒక్కో వార్డు పరిధిలో సుమారు 40 వేల నుండి 50 వేల మంది ఓటర్లు ఉండటం గమనార్హం. ఇది ఒక చిన్నపాటి అసెంబ్లీ నియోజకవర్గంతో సమానం. ఇంత పెద్ద మొత్తంలో ఓటర్లను కలుసుకోవడం, ప్రచారం చేయడం అభ్యర్థులకు కత్తి మీద సాము లాంటిదే. ఈ పరిణామం అటు సీనియర్లను, ఇటు కొత్తగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావాహులను కలవరపెడుతోంది.

### పార్టీ గుర్తే గెలుపు మంత్రం..?

పెరిగిన ఓటర్ల సంఖ్య దృష్ట్యా, స్వతంత్రంగా పోటీ చేయడం కంటే అధికారికంగా రాజకీయ పార్టీల గుర్తు (బీ – ఫామ్) మీద పోటీ చేస్తేనే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విశ్లేషణలు చెబుతున్నాయి. పార్టీ క్యాడర్, గుర్తుకున్న బలం, అగ్ర నాయకత్వం మద్దతు ఉంటేనే ఈ భారీ వార్డుల్లో నెగ్గుకురాగలమని ఆశావాహులు భావిస్తు న్నారు. దీంతో ప్రధాన పార్టీల టికెట్ల కోసం ఇప్పటి నుంచే పోటీ తీవ్రమైంది.

### సీనియర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమేనా..?

మారిన ఈ పరిస్థితుల్లో సీనియర్ నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొత్త సమీకరణాల నేపథ్యంలో తమ రాజకీయ ప్రస్థానం ముగిసినట్లేనా? అన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. అదే సమయంలో టికెట్లపై ఆశలు పెట్టుకున్న ఆశావాహుల్లో టెన్షన్ తారాస్థాయికి చేరింది. ఈ రాజకీయ చదరంగంలో చివరికి నిలబడేది ఎవరు? గెలిచేది ఎవరు? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. రిజర్వేషన్ల చిక్కుముడి వీడితేనే క్లారిటీ వస్తుంది. అప్పుడు నాయకులు టికెట్ల వేటలో ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తుంది. రిజర్వేషన్ల అంశం ఇంకా అస్పష్టంగానే ఉంది. రిజర్వేషన్ల చిక్కుముడి వీడితే గానీ, ఎవరు ఏ వార్డు నుండి పోటీ చేయాలనే దానిపై స్పష్టత వస్తుంది. అప్పటి వరకు ఈ ఉత్కంఠ కొనసాగేలా ఉంది. మొత్తం మీద పీర్జాదిగూడ సర్కిల్ రాజకీయం రసవత్తరంగా మారింది.

## ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

### కాంగ్రెస్, బిఆర్ఎస్ కూటమి అభ్యర్థి గొడ్డే సరోజిని అమ్మ.

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు గ్రామ పంచాయతీలో 17 వ తేదీన జరుగబోతున్న స్థానిక ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గొడ్డే సరోజినీ దేవి అమ్మను కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని,చిన్న గొల్లగూడెం గ్రామం ప్రచారంలో సుమారు 3 వందల మందికి పైగా ప్రజలతో సమావేశం నిర్వహించారు.చిన్నగొల్లగూడెం గ్రామంలో 7వ వార్డు తాడూరి సంపత్, స్టూలు గుర్తుకు ఓటు వెయ్యాలని, అలాగే 8వ వార్డు కత్తెర సౌజన్య, గ్యాస్ పొయ్యి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు.గొడ్డే శరత్ మాట్లాడుతూ..గ్రామాల్లో ఉన్న సిసి రోడ్లు, విద్యుత్తు,డ్రైనేజీ సమస్యలతోపాటు, అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం ఎంపికలో భాగంగా ప్రాధాన్యం ఉండేలా కృషి చేస్తానని అన్నారు. పేరూరు గ్రామపంచాయతీలో కాంగ్రెస్,బిఆర్ఎస్ కూటమి ప్రజలు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండి, అభివృద్ధికి



ముందుండి,ప్రజలకు ఎల్లవేళలా వారి సమస్యలకు పరిష్కారం అందేలా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాడూరి వెంకట్రామయ్య,ఎర్రవుల సమ్మయ్య బొల్లె సమ్మయ్య, కాంగ్రెస్,బిఆర్ఎస్ కుటుంబ నాయకులు శేషు,సోమిడి నరసింహారావు,ఆది,టింగ బుచ్చయ్య, రఘుపతి, కుంట నరసింహారావు బొల్లెనారాయణ,తొర్రెమ్ శీను,యాదండ్ల శ్రీకాంత్, జీవన్, మల్లయ్య, అరికిల్ల సర్వేష్, గుడివాడ శేఖర్,యాదండ్ల శేషి, ఎట్టి సుదర్శన్,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సాలె ఈరమ్మ గెలుపు అభివృద్ధికి మలుపు

### మాజీ సర్పంచ్ భైరం మౌనిక మహేష్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకి బాటలు అని మాజీ సర్పంచ్ భైరం మౌనిక మహేష్ అన్నారు.తిరుమలాయపాలెం మండలంలోని ఎదుళ్ల చెరువు గ్రామ పంచాయతీ సిపిఐ ఎంఎల్ బలపరచిన కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిని సాలె ఈరమ్మ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకి వివరిస్తూ ఆమె ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి గత రెండేళ్లలో విద్య, వైద్యం,వ్యవసాయం వంటి రంగాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. ఎదుళ్ల చెరువు గ్రామంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మారథం పడుతున్నారని చెప్పారు.సాలె ఈరమ్మ గెలిస్తే గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతుందని చెప్పారు.ఎల్లప్పుడూ ప్రజలకి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తుందని వెల్లడించారు.

# సీజ్ పేరుతో సర్కారుకు టోకరా..

## ఆఫీసర్లకు కాసుల వర్షం!

- ముషీరాబాద్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ 'మాయాజాలం'
- సీజ్ చేసినా ఆగని పనులు.. సెటిల్మెంట్ల కోసమేనా ఈ హడావిడి?
- దయారా మార్కెట్ అక్రమ నిర్మాణంపై అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?
- జోనల్ కమిషనర్ పర్యవేక్షణ శూన్యం.. ప్రభుత్వ ఆదాయానికి గండి







**ముషీరాబాద్,రాజముద్ర న్యూస్:** అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో 'సీజ్'ల పర్వం కేవలం వసూళ్ల కోసమే సాగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే, వాటిని సీజ్ చేసినట్లు నటించి, వెనుక దారిలో 'మామూళ్లు' దండుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

### సీజ్ చేసినా.. పనులు ఆగవ్!

సాధారణంగా ఏదైనా భవనాన్ని అధికారులు సీజ్ చేస్తే అక్కడ పనులన్నీ ఆగిపోవాలి. కానీ ముషీరాబాద్ సర్కిల్‌లో మాత్రం సీజ్ చేశాక పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి. డిప్యూటీ కమిషనర్, ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ల స్థాయిలోనే ఈ తంతు నడుస్తోందని, సీజ్ చేయడం కేవలం రేటు పెంచుకునేందుకేనని స్థానికులు మండిపడుతున్నారు.

### కాసుల కోసం కక్కుర్తి.. దయారా మార్కెట్ ఉదంతం

తాజాగా దయారా మార్కెట్ వద్ద ఇంటి నెంబర్ 1-7-540లో జరుగుతున్న భారీ అక్రమ నిర్మాణం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు, ఏసీపీ దేవేందర్ తమ సిబ్బందితో వచ్చి ఆర్భాటంగా ఈ భవనాన్ని సీజ్ చేశారు. కానీ, ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ, సీజ్ చేసిన భవనంలో పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఆ భవనానికి రంగులు



వేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

### జోనల్ కమిషనర్ పర్యవేక్షణ ఏది?

కళ్ళ ముందే ఇంత జరుగుతున్నా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు? కింది స్థాయి అధికారుల అవినీతి ఆయన దృష్టికి రావడం లేదా? లేక ఆయన పర్యవేక్షణ లోపమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బులు అధికారుల జేబుల్లోకి వెళ్తుంటే ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించి, సీజ్ చేసిన భవనాల్లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపి, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నోబెల్ పురస్కార ప్రదానోత్సవానికి శాంతి బహుమతి గ్రహీత గైర్హాజరు



**ఓస్లో :** ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. నేడు నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పురస్కార ప్రదానోత్సవం జరుగుతోంది. అయితే ఈ కార్యక్రమానికి ముందు నార్వే రాజధాని ఓస్లోలో నిర్వహించే మీడియా సమావేశానికి శాంతి బహుమతి గ్రహీత మరియా కొరీనా గైర్హాజరయ్యారు. దీంతో నిర్వాహకులు మీడియా సమావేశాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి కూడా ఆమె హాజరు కావట్లేదని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ వెల్లడించారు. మరియా తరఫున ఆమె కుమార్తె నోబెల్ బహుమతిని స్వీకరించనున్నట్లు తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని ఇప్పటికే వెనెజువెలా అటార్నీ జనరల్ వెల్లడించిన నేపథ్యంలో.. మరియా నోబెల్ ప్రదానోత్సవానికి గైర్హాజరయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నార్వే రాజధాని ఓస్లోలోని ఓస్లో సిటీ హాల్‌లో జరుగుతున్న నోబెల్ ప్రదానోత్సవ కార్యక్రమానికి మరియా కుటుంబసభ్యులు, వివిధ దేశాల ప్రముఖులు హాజరయ్యారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు నార్వే కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది నుంచి అజ్ఞాతంలోనే ఉంటున్నారని పేర్కొంది.

# 'పూర్తి డేటాతో రండి'..

## ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం




**న్యూఢిల్లీ :** ఇండిగో విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయాలతో ఇటీవల లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సంస్థ సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తూ కేంద్రం ఇప్పటికే చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తమ ముందు హాజరుకావాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవలి పరిణామాలకు సంబంధించిన పూర్తి డేటాతో ఈ నెల 11న డీజీసీఏ కార్యాలయానికి రావాలని ఓ ప్రకటనలో తెలిపింది. "ఇండిగో సీఈవో, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డీజీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలి. ఇటీవలి అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, అప్‌డేట్‌లు, పూర్తి నివేదికతో రావాలి" అని డీజీసీఏ ఆదేశించింది. విమాన సర్వీసుల పునరుద్ధరణబీ పైలట్లు, సిబ్బంది నియామకాల ప్రణాళికబీ పైలట్లు, క్యాబిన్ సిబ్బంది సంఖ్య వివరాలుబీ రద్దయిన విమానాల సంఖ్యబీ రీఫండ్‌లు తదితర పూర్తి సమాచారాన్ని అందజేయాలని సూచించింది. ఇండిగో వ్యవహారంపై దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలి అంతరాయాలకు దారితీసిన కారణాలను గుర్తించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పౌర విమానయాన శాఖ ఇప్పటికే వెల్లడించింది. డీజీసీఏ ఇప్పటికే ఓసారి ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ తీసుకుంది. కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని విమానయాన సంస్థ కోరింది.




# రైలు టికెట్ ధరలు మనదగ్గరే తక్కువ : అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ :** అభివృద్ధి చెందిన దేశాలు, పొరుగుదేశాలతో పోలిస్తే భారత్‌లోనే రైలు టికెట్ ధరలు తక్కువగా ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. వీటి ధరలు తక్కువగా ఉంచేందుకు గతేడాది రూ.60వేల కోట్లు సబ్సిడీ అందించామన్నారు. వయోవృద్ధులకు రైలు టికెట్ రాయితీని పునరుద్ధరించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అని కాంగ్రెస్ ఎంపీ ఎంకే విష్ణు ప్రసాద్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి ఈ సమాధానమిచ్చారు. "పొరుగు దేశాలతో పోలిస్తే మనదగ్గర రైలు టికెట్ ధరలు చాలా అందుబాటులో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ధరల్లో ఇవి ఐదు నుంచి పది శాతం మాత్రమే. గతేడాది దాదాపు రూ.60వేల కోట్లు రాయితీల కోసం అందించాం. తద్వారా ప్రయాణికుల టికెట్ ధరలు అందుబాటులో ఉన్నాయి" అని రైల్వే మంత్రి వివరణ ఇచ్చారు. కరోనా విజృంభణ సమయంలో రైళ్లలో సీనియర్ సిటిజన్ ప్రయాణ టిక్కెట్ల రుసుములో ఇచ్చే రాయితీలను కేంద్రం ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వాటిని పునరుద్ధరించలేదు.

# గుజరాత్‌లో భారీ అగ్నిప్రమాదం

**గుజరాత్ :** గుజరాత్‌లోని సూరత్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్‌లోని బహుళ అంతస్తుల టెక్స్‌టైల్ మార్కెట్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. భవనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అగ్ని ప్రమాదంలో టెక్స్‌టైల్ మార్కెట్‌లోని పలు దుకాణాలు దగ్ధమైనట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ లిఫ్ట్ వైరింగ్‌లో ప్రారంభమైన మంటలు 7వ అంతస్తు వరకు వ్యాపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని అధికారులు వెల్లడించారు. భారీగా అగ్ని కీలలు ఎగసిపడడంతో మార్కెట్ భవనంలోని 20కి పైగా దుకాణాలు మంటల్లో చిక్కుకున్నట్లు తెలిపారు. దుకాణాలలో పెద్ద మొత్తంలో ఉన్న వస్త్రాలకు మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు.

## భారత్‌తో వాణిజ్య చర్చల్లో

# మాకు బెస్ట్ ట్రేడ్ ఆఫర్స్

### అమెరికా ప్రతినిధి జెమీసన్ గ్రీర్



**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ చర్చల్లో భాగంగా తమకు భారత్ నుంచి అత్యుత్తమ ట్రేడ్ ఆఫర్స్ అందాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ వెల్లడించారు. భారత వ్యవసాయ మార్కెట్‌లోకి విస్తరించే దిశగా, అడ్డంకులను అధిగమించేలా చర్చలు ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు సెనెట్ కేటాయింపుల సబ్‌కమిటీ విచారణలో పేర్కొన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే తాము ఈ వాణిజ్య ఒప్పందం విషయంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. ప్రస్తుతం అమెరికా వాణిజ్య ప్రతినిధుల బృందం న్యూఢిల్లీలో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. అలాగే అమెరికా వస్తువులకు చైనా మార్కెట్‌లో ఇబ్బందులు ఎదురవుతోన్న సమయంలో ఇప్పుడు భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్‌గా ఉంటుందని సూచించారు. దిల్లీలో జరుగుతోన్న చర్చలకు యూఎస్ తరఫున డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొంటున్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అగ్రరాజ్య ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. అనంతరం సెప్టెంబరు 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాకు వెళ్లింది. ఈ క్యాలెండర్ ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఇటీవల వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. అందులో భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాల అంశాన్ని కూడా ప్రస్తావిస్తామని తెలిపారు. అలాగే టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి ఓసారి.. పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరోసారి చర్చలు జరుపుతామని చెప్పారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఒకవైపు సంక్షోభం ఉంటే..

# టికెట్ ధర రూ.40వేలా..?

### కేంద్రానికి హైకోర్టు ప్రశ్న



**న్యూఢిల్లీ :** ఇండిగో సంక్షోభంపై దిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. అసలు ఈ సంక్షోభం ఎందుకు తలెత్తిందని కేంద్రాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఇలాంటి సమయంలో విమాన టికెట్ ధరలు అమాంతం ఎందుకు పెరిగాయని అడిగింది. "ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. దాని నుంచి ప్రయోజనం పొందేందుకు ఇతర విమానయాన సంస్థలకు అనుమతి ఎలా లభించింది. టికెట్ ధర రూ.40వేల వరకు ఎలా వెళ్లింది..? ఇదంతా ఎలా జరిగింది" అని కోర్టు ప్రశ్నించింది. ఇండిగో వందల సంఖ్యలో సర్వీసుల్ని రద్దు చేయడంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఆ ఎఫెక్ట్‌తో ఇతర విమానయాన సంస్థల్లో టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు దాదాపు రెండు, మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ముంబయి-దిల్లీ మధ్య విమాన సర్వీసుల టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ఒక ఎకానమీ టికెట్‌కు రూ.35వేలు వసూలు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. సాధారణంగా ఆ మార్గంలో ప్రయాణించేందుకు చివరి నిమిషంలో బుక్ చేసినా.. విమానంలో వెళ్లిరావడానికి రూ.20వేలు ఖర్చవుతాయని పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదలపై కేంద్రం పరిమితులు విధించింది. అయితే ఈ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమైందని హైకోర్టు పేర్కొంది. "ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను అభినందిస్తున్నాం. అయితే ఇక్కడ మా ప్రశ్న ఏంటంటే.. అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. దీనికి ఎవరు కారణం..? ఇక్కడ ప్రయాణికులు చిక్కుకుపోవడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగింది. చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు ఏంటి..?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. దాంతో ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వెల్లడించారు. ఆ సమాధానంతో న్యాయస్థానం సంతృప్తి చెందలేదు. "సంక్షోభం వచ్చాక మీరు ఆ చర్యలు తీసుకున్నారు. మా ప్రశ్న అదికాదు. అసలు ఆ సమస్య ఎందుకు వచ్చింది..? అప్పటివరకు మీరు ఏం చేస్తున్నారు..? అలాగే పైలట్లు ఎందుకు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుంది..? ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇండిగో తగినంతమంది పైలట్లను నియమించుకోవాలని, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే.. ఇండిగో విమాన సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తున్నామని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనివల్ల ఆ సంస్థ సర్వీసులను స్థిరీకరించవచ్చని, రద్దులను తగ్గించవచ్చని తెలిపారు. ఇది ఇండిగోకు భారీ ఎదురుదెబ్బ అవుతుందని తెలుస్తోంది. ఆ పదిశాతం ఆకాశ-స్పైస్‌జెట్ మొత్తం వాటాకు సమానం కావడం గమనార్హం. ఇండిగో సంక్షోభంతో మార్కెట్లో ఏర్పడిన డిమాండ్‌ను అందిపుచ్చుకొనేందుకు స్పైస్‌జెట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. దాంతో దాని శీతాకాల షెడ్యూల్‌లోకి అదనంగా 100 సర్వీసులు చేర్చనున్నట్లు ప్రకటించింది.

# ఇండిగో సంక్షోభం..

### దిల్లీలో రూ.1,000 కోట్లు నష్టం

**న్యూఢిల్లీ :** ఇండిగో సంక్షోభం వల్ల దిల్లీలో వ్యాపార, పర్యాటక, పారిశ్రామిక రంగాలకు రూ.1,000 కోట్లు నష్టం వాటిల్లిందని ది ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ వెల్లడించింది. విమాన రాకపోకల్లో అంతరాయం వల్ల వ్యాపారులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్స్ రాకపోకలకు అంతరాయం కలిగిందని పేర్కొంది. దీనివల్ల గత 10 రోజుల్లో దిల్లీ మార్కెట్లలో జనసంచారం దాదాపు 25శాతం తగ్గిందని వివరించింది. దిల్లీ విమానాశ్రయం నుంచి నిత్యం 1.5 లక్షల ప్యాసింజర్లు ప్రయాణిస్తుంటారని.. అందులో సుమారు 50 వేల మంది వ్యాపారులు, బిజినెస్ ట్రావెలర్స్ ఉంటారని తెలిపింది. పెద్దఎత్తున ఇండిగో విమానాలు రద్దవడం వల్ల దిల్లీ ఆర్థికవ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ పేర్కొన్నారు. గత వారం రోజుల్లో దిల్లీలోని అనేక హోటళ్ళు, రెస్టరంట్లు, రిసార్ట్‌లలో వేలాది బుకింగ్‌లను పర్యటకులు రద్దు చేసుకున్నారని తెలిపారు. గత 10 రోజులుగా ప్రగతి మైదాన్, ఆనంద్ మండపంలో ఆటోమొబైల్స్, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలకు సంబంధించిన భారీ ప్రదర్శన జరుగుతోందని తెలిపారు.
ఈ ప్రదర్శనలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా వేలాది మంది వ్యాపారులు, సందర్శకులు నమోదు చేసుకున్నారని.. విమానాల రద్దు నేపథ్యంలో ఎక్కువ మంది దిల్లీకి చేరుకోలేకపోయారన్నారు. వివాహాలు, ఇతర వేడుకలను ప్రజలు రద్దు చేసుకుంటుండడంతో వెడ్డింగ్ ప్లానర్లు, ఫంక్షన్ హాళ్ల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు.

# లిథువేనియాలో నేషనల్ ఎమర్జెన్సీ తెచ్చిన బెలూన్లు



**లిథువేనియా :** బెలారస్ ప్రయోగిస్తున్న వాతావరణ బెలూన్ల వల్ల లిథువేనియాలో నేషనల్ ఎమర్జెన్సీ విధించాల్సి వచ్చింది. బెలారస్ ప్రయోగిస్తున్న బెలూన్లతో తరచూ లిథువేనియా గగనతల మార్గాల్లో సమస్యలు తలెత్తుతుండడంతో ఆ దేశ ప్రభుత్వం నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఇందులోభాగంగా పోలీసులు, భద్రతా బలగాలతో పాటు సైన్యం కూడా సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుందని ఆ దేశాధ్యక్షుడు తెలిపారు. ఈ సమయంలో పార్లమెంట్ నుంచి వచ్చే అదనపు హక్కుల ద్వారా సైన్యం అనుమానాస్పద ప్రదేశాల్లో సోదాలు నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిని అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు చేపడుతుంది. పౌరులపై దీని ప్రభావం పరిమితంగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ఇరుదేశాల సరిహద్దు ఉద్రిక్తతలపై చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు లిథువేనియా అధ్యక్షుడు గిటానస్ ప్రకటించారు. బెలూన్లతో తమపై బెలారస్ చేస్తున్న హైబ్రిడ్ దాడిని ఎదుర్కోవడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని ఇంగా రుగినియెక్ పేర్కొన్నారు. బెలూన్లపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారని.. వీటి వెనక ఉన్న కుట్ర త్వరలోనే బయటపడనుందని అంతర్గత మంత్రి వ్లాడిస్లావ్ కొంద్రాటోవిచ్ అన్నారు. వాతావరణ పరిస్థితులు అంచనా వేసేందుకు బెలారస్ వెదర్ బెలూన్లను ప్రయోగిస్తోంది. అయితే అవి అదుపుతప్పి లిథువేనియా గగనతలంలోకి వెళ్లిపోతున్నాయి. దాంతో లిథువేనియాలో విమాన కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. బెలారస్‌లోని అటవీ ప్రాంతం వైపు నుంచి ఇటీవల అనేక బెలూన్లు దూసుకువస్తున్నాయని లిథువేనియా ప్రభుత్వం ఆరోపించింది. ఇది తమ ఆర్థిక వ్యవస్థ, వైమానిక భద్రతను లక్ష్యంగా చేస్తోన్న హైబ్రిడ్ దాడి అని లిథువేనియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. అయితే ఈ ఆరోపణలు నిజమని తేలితే క్షమాపణలు చెప్పడానికి కూడా సిద్ధమేనని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ఇప్పటికే స్పష్టం చేశారు.

## టారిఫ్‌లపై సుప్రీంకోర్టు ఇచ్చే రూలింగ్‌తో

# అమెరికా భద్రతకే ముప్పు : ట్రంప్



**పెన్సిల్వేనియా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాలపై విధించిన టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పెన్సిల్వేనియాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే దానివల్ల అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సుంకాలను వ్యతిరేకిస్తూ కొందరు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేస్తుండడాన్ని విమర్శించారు. తాను విధించిన టారిఫ్‌ల ద్వారా వందల బిలియన్ డాలర్లు సృష్టించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తాను చేసే మరిన్ని అద్భుతాలను చూస్తారని వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే అమెరికాకు ఆర్థిక రక్షణ లేకుండా పోతుందని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర దేశాలు తమ దేశం విషయంలో ఎలా అయితే ప్రవర్తిస్తున్నాయో తాము కూడా అలాగే బదులు చెబుతామని.. ఆ విధంగా ప్రవర్తించవద్దని తమను ఎవరూ అడ్డుకోవద్దని వ్యాఖ్యానించారు. తమతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై సుంకాలు అమలు చేయడం వల్ల అమెరికా జాతీయ భద్రత మెరుగుపడిందన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఈ విషయంపై విచారణ కొనసాగుతోంది.

## కోర్టు విచారణకు వెళ్తుండగా

# ప్రత్యక్ష సాక్షిని ఢీకొన్న ట్రక్కు

**కోల్‌కతా:** ఓ కేసు విషయంలో తృణమూల్ కాంగ్రెస్ నేతకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు వెళ్తున్న ప్రత్యక్ష సాక్షి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారు వెళ్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ప్రత్యక్ష సాక్షికి తీవ్ర గాయాలు కాగా అతడి కుమారుడు, కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో గతేడాది మహిళలపై వేధింపులు, భూ ఆక్రమణ కేసుల్లో ప్రధాన నిందితుడైన షాజహాన్‌పై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు విషయంలో కోర్టు ముందు హాజరవ్వడానికి కీలక సాక్షి భోలానాథ్ ఘోష్ వెళ్తుండగా.. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బోయ్‌రామారి పెట్రోల్ పంప్ సమీపంలో వేగంగా వచ్చిన ట్రక్కు వారి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భోలానాథ్‌కు తీవ్ర గాయాలు కాగా అతడి చిన్న కుమారుడు సత్యజిత్ ఘోష్ (32), కారు డ్రైవర్ సహనూర్ (27) ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం అనంతరం ట్రక్కును అక్కడే వదిలేసి, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ట్రక్కు ఉద్దేశపూర్వకంగానే కారును ఢీకొట్టి.. సమీపంలో ఉన్న వాగులోకి లాక్కెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేపట్టారు. షాజహాన్ షేక్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతున్నాడనే కక్షతో ఉద్దేశపూర్వకంగానే నిందితుడి అనుచరులు ఈ దారుణానికి పాల్పడ్డారని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జైలు నుంచి షాజహాన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తన తండ్రిని హతమార్చడానికి కుట్ర పన్నారని భోలానాథ్ పెద్ద కుమారుడు బిశ్వజిత్ ఆవేదన వ్యక్తం చేశారు.

## సెంట్రల్ ప్యానల్ చీఫ్‌ల ఎంపిక..

# మోదీతో విభేదించిన రాహుల్



**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి కీలకమైన సెంట్రల్ ప్యానళ్ల చీఫ్‌ల ఎంపికలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీతో విభేదించారు. పారదర్శక సంస్థలకు నియామకాలను ఖరారు చేయడానికి బుధవారం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో లోక్‌సభలో ప్రతి పక్ష నేత హోదాలో రాహుల్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అత్యున్నత పదవులకు ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్లు పేర్కొంటూ.. లిఖితపూర్వక అసమ్మతి నోట్‌ను అందజేశారు. అయితే సెంట్రల్ ప్యానళ్ల చీఫ్‌ల ఎంపికలో షార్ట్‌లిస్ట్ చేసిన అధికారులకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. మంగళవారం లోక్‌సభ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ..దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఈసీని భాజపా వాడుకుంటోందని ఆరోపించిన విషయం తెలిసిందే. తన ప్రసంగానికి సంబంధించిన వీడియోను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో షేర్‌చేశారు. ఎన్నికల్లో అవకతవకలపై లోక్‌సభలో తాను కేంద్రాన్ని అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానం ఒకటేనని పేర్కొన్నారు. అది ఓట్ల చోరీకి భాజపా ఎన్నికల కమిషన్‌ను ఓ సాధనంగా వాడుకోవడమేనని రాసుకొచ్చారు.

# హసీనా అప్పగింతపై.. భారత్‌ను ఒప్పించేందుకు ప్రయత్నిస్తాం : బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ :** భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి రప్పించేందుకు దౌత్యపరంగా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటామని బంగ్లాదేశ్ తెలిపింది. ఏదేమైనా హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి రావడమనేది భారత్ చేతుల్లో ఉందని పేర్కొంది. ఆమెను వెనక్కి పంపించేలా భారత్‌ను ఒప్పించేందుకు ప్రయత్నిస్తామని బంగ్లా విదేశీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహిద్ హొస్సేన్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుల్లో గత నెలలో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లో న్యాయస్థానాలు ఆమెకు 21 ఏళ్లు, ఐదేళ్ల జైలుశిక్ష విధించాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆమెను అప్పగించాలని ఢాకా డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంపై ఇటీవల భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ.. "ప్రత్యేక పరిస్థితుల్లో హసీనా భారత్‌కు వచ్చారు. తుది నిర్ణయం ఆమే స్వయంగా తీసుకోవాలి" అని చెప్పారు.

# భారత్‌కు గూగుల్ 'ఏఐ ప్లస్'.. నెలవారీ ప్లాన్ ఎంతంటే?




ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ 'ఏఐ ప్లస్' సేవలను భారత్‌లో అందుబాటు లోకి తీసుకువచ్చింది. దీని నెలవారీ చందాను రూ.399గా ప్రకటించింది. కొత్తగా వచ్చిన చందాదారులు తొలి ఆరు నెలల పాటు ఈ సేవలను రూ. 199కే ఆనందించొచ్చని తెలిపింది. ఈ ప్లాన్ ద్వారా గూగుల్ లేటెస్ట్ ఏఐ మోడళ్లను, ఫీచర్లను తక్కువ ధరకే పొందొచ్చని గూగుల్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏఐ ప్లస్ ప్లాన్ ద్వారా జెమినై యాప్‌లో జెమినై 3 ప్రో మోడల్‌ను యాక్సెస్ చేయొచ్చు. గూగుల్ ఇమేజ్ జనరేషన్, ఎడిటింగ్ మోడల్, నానో బనానా ప్రోనూ వాడుకోవచ్చు. వీడియో జనరేషన్‌తో పాటు ఫ్లో వంటి క్రియేటివ్ టూల్స్‌ను ఈ ప్లాన్ ద్వారా యాక్సెస్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. జీమెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్ఎం కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 200 జీబీ స్టోరేజీని ఏఐ ప్లస్ ద్వారా ఉచితంగా పొందొచ్చని గూగుల్ తెలిపింది. ఏఐ ప్లస్‌ను తీసుకున్నవారు ఐదుగురు కుటుంబసభ్యులతో ఈ ప్లాన్‌ను పంచుకోవచ్చని పేర్కొంది.






# మూడో రోజూ నష్టాల్లోనే..

## సెన్సెక్స్ 600 పాయింట్లు పతనం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడినా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల ప్రకటన వేళ మదుపర్ల లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. అమెరికా ఫెడ్ నిర్ణయాలు బుధవారం రాత్రి వెలువడనున్నాయి. సెన్సెక్స్ ఉదయం 84,607.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,666.28) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లోకి వచ్చినప్పటికీ.. తర్వాత మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 85,020.34 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. గరిష్ఠాల నుంచి దాదాపు 600 పాయింట్ల మేర పతనమైంది. 275 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.65 పాయింట్ల నష్టంతో 25,758 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ట్రెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, సన్‌ఫార్మా, ఐటీసీ, ఎన్టీపీసీ, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4194 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# అందువల్లే తిరిగి మైదానంలో అడుగు పెట్టగలిగాను

## హార్దిక్ పాండ్య

సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగుపెట్టేలా చేసిందని టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అన్నాడు. దీనివల్లే గాయం తర్వాత తాను మరింత దృఢంగా పునరాగమనం చేశానని అతడు వివరించాడు. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన హార్దిక్ దాదాపు రెండు నెలల తర్వాత కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో కనిపించాడు. ఇటు బ్యాట్‌తోనూ, అటు బంతితోనూ రాణించాడు. ముఖ్యంగా బ్యాటింగ్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 175 పరుగులు చేయడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు 28 బంతుల్లో 59లి పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో రెండు ఓవర్లు వేసి 16 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా, మిన్నగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. స్ట్రాంగ్‌గా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు' అని హార్దిక్ పాండ్య అన్నాడు. 'అలాగే మైదానంలోకి దిగిన తర్వాత ప్రతి క్షణం.. ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా. జనాన్ని ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా భాగస్వామి కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి విషయాలు జరిగాయి' అని హార్దిక్ పాండ్య తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మ గురించి తెలిపాడు. ముంబయిలో కొందరు ఫొటోగ్రాఫర్లు అత్యుత్సాహంతో మహికా శర్మ ఫొటోలు తీసిన విషయాన్ని మంగళవారం ఇన్‌స్టా స్టోరీలో హార్దిక్ పాండ్య ప్రస్తావించిన విషయం తెలిసిందే. 'మహికా శర్మ.. బాంద్రాలో ఓ రెస్టరంట్ దగ్గర నడుచుకుంటూ వెళ్తోంది. అప్పుడు ఓ ఫొటోగ్రాఫర్.. ఆమె ఫొటోలను తీశాడు. అయితే ఆడవాళ్లు ఇబ్బందిపడేలా ఉన్న కోణంలో వాటిని తీశాడు. సెన్సేషనలిజం కోసం వ్యక్తిగత గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదు. ఆడవాళ్లకు మనం కనీస మర్యాద ఇవ్వాలి. ప్రతి ఒక్కరికీ హద్దులుంటాయి' అని హార్దిక్ అసహనం వ్యక్తం చేశాడు.

# సంజుశాంసన్ నాకు పెద్దన్నలాంటోడు : జితేశ్ శర్మ




మరి కొన్ని నెలల్లోనే టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం సంజుశాంసన్, జితేశ్ శర్మ మధ్య తీవ్రమైన పోటీ ఉంది. కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో సెలక్టర్లు జితేశ్ శర్మ వైపే మొగ్గు చూపారు. దీంతో సంజుశాంసన్ తుది జట్టులో స్థానం సంపాదించుకోలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో జితేశ్ శర్మ 10 పరుగులతో (5 బంతుల్లో, 1 ఫోర్) నాటౌట్‌గా నిలిచాడు. మొదటి టీ20లో టీమ్ఇండియా ఒకనొక దశలో 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయినప్పటికీ హార్దిక్ పాండ్య (59, 28 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్సలు) ధనాధన్ బ్యాటింగ్, తిలక్ వర్మ (26, 32 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (23, 21 బంతుల్లో, 2 సిక్సలు) సమయోచిత ఇన్నింగ్స్‌తో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేయగలిగింది. టీమ్ఇండియా బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్‌లో భారత జట్టు 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం జితేశ్ శర్మ.. తనకు, సంజుశాంసన్ మధ్య ఉన్న అనుబంధాన్ని గురించి మాట్లాడాడు. 'అతడు జట్టులో ఉన్నందుకు ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే సంజుశాంసన్ నాకు పెద్దన్నలాంటోడు. ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడు, మనలో దాగున్న ప్రతిభ బయటకు వస్తుంది. ఇది జట్టుకు కూడా ఎంతో మంచిది. సంజుశాంసన్ అద్భుతమైన ఆటగాడు. మేమిద్దరం టీమ్ఇండియా తరపున ఆడుతున్నాం. మేం సోదరుల్లాంటివారం. అతడు నాకు చాలా సాయం చేశాడు' అని జితేశ్ శర్మ అన్నాడు. సంజుశాంసన్ 2024లో టీ20 ఫార్మాట్‌లో మూడు సెంచరీలు చేశాడు. కానీ.. శుభ్‌మన్ గిల్ వైస్‌కెప్టెన్‌గా నియమితుడయ్యాక అతడికి టాప్‌ఆర్డర్‌లో చోటు దక్కడం లేదు. అప్పటినుంచి సంజుశాంసన్ మిడిలార్డర్, లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో ఏకంగా జట్టులో స్థానమే కోల్పోయాడు.

# వన్డేల్లో రెండో ర్యాంక్‌కు చేరుకున్న విరాట్ కోహ్లీ



తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. అలాగే మొదటి స్థానానికి అతి చేరువగా వచ్చాడు! ప్రస్తుతం ఆ స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. అంతకు ముందు నాలుగో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ.. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్, అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్‌ను వెనక్కి నెట్టి రెండు స్థానాలు ఎగబాకాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో విరాట్ కోహ్లీ రెండు వరుస సెంచరీలు(135, 102) , ఒక హాఫ్ సెంచరీతో (65లి) అద్భుతంగా రాణించాడు. ఈ టోర్నీలో అతడు ఏకంగా 302 రన్స్ రాబట్టి, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనలతో వన్డే ర్యాంకింగ్స్‌లో 773 పాయింట్లతో రెండో స్థానానికి దూసుకెళ్లాడు. మొదటి స్థానంలో ఉన్న రోహిత్ శర్మ ఖాతాలో 781 పాయింట్లున్నాయి. రోహిత్, విరాట్‌కు మధ్య అంతరం కేవలం ఎనిమిది పాయింట్లే కావడం గమనార్హం. బౌలర్ల విభాగంలో కుల్‌దీప్ యాదవ్ మూడు స్థానాలు ఎగబాకి నం.3 స్థానానికి చేరుకున్నాడు. మొదటి స్థానంలో అఫ్గానిస్థాన్ క్రికెటర్ రషీద్ ఖాన్, రెండో ప్లేస్‌లో ఇంగ్లాండ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఉన్నారు. దక్షిణాఫ్రికాతో ముగిసిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్ యాదవ్ తొమ్మిది వికెట్లతో లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గానిస్థాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

**ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటర్ల ర్యాంక్‌లు**

1. రోహిత్ శర్మ (భారత్) – 781
2. విరాట్ కోహ్లీ (భారత్)– 773
3. డెరిల్ మిచెల్ (న్యూజిలాండ్)– 766
4. ఇబ్రహీం జద్రాన్ (అఫ్గానిస్థాన్)– 764
5. శుభ్‌మన్ గిల్ (భారత్)– 723
6. బాబర్ అజామ్ (పాకిస్థాన్) – 722
7. హ్యారీ టెక్టర్ (ఐర్లాండ్)– 708
8. షాయ్ హోప్ (వెస్టిండీస్)– 701
9. చరిత్ అసలంక (శ్రీలంక)– 690
10. శ్రేయస్ అయ్యర్ (భారత్)– 679

# వారిద్దరి కంటే మెరుగైన ఆటగాళ్లున్నారా?

## హర్భజన్ సింగ్




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో వీరు తమ సత్తా చాటారు. రోహిత్ శర్మ.. రాంచీ, విశాఖపట్నం వన్డేల్లో హాఫ్ సెంచరీలు (57, 75) సాధించాడు. మరోవైపు కోహ్లీ మొదటి రెండు వన్డేల్లో వరుస సెంచరీలు (135, 102), మూడో వన్డేలో హాఫ్‌సెంచరీతో (65లి) అద్భుతమైన ఫామ్‌తో వింటేజ్ విరాట్‌ను గుర్తుకుతెస్తున్నాడు. ఓవరాల్‌గా 302 రన్స్‌తో సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో వీరి గురించి టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా మాట్లాడాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కంటే.. మెరుగైన ఆటగాళ్లున్నారా? కాబట్టి వారిని జట్టు నుంచి తప్పించకూడదు. దానికి బదులుగా వారి అనుభవాన్ని యువ క్రికెటర్లు ఉపయోగించుకునేలా జట్టును రూపొందించాలి. టీమ్ మొత్తాన్నీ యువ క్రికెటర్లతో నింపాలని చూస్తే.. పెద్ద మ్యాచుల్లో ఇబ్బందిపడాల్సివస్తుంది. అందుకే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని రానున్న వన్డే వరల్డ్‌కప్‌లో కచ్చితంగా ఆడించాలి. ఆ తర్వాత వారు మరో వరల్డ్ కప్ ఆడే అవకాశమే లేదు కదా' అని హర్భజన్ సింగ్ విశ్లేషించాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం చేస్తున్న బ్యాటింగ్‌ను చూస్తుంటే.. టీమ్ఇండియా చాలా బలంగా కనిపిస్తోంది. వారు తమ ఫిట్‌నెస్‌నూ చక్కగా కాపాడుకుంటున్నారు. అయితే వారు వరల్డ్ కప్ ఆడేందుకు అవకాశం దక్కుతుందా? లేదా? అనే విషయంలోనే సందిగ్ధత ఉంది. యువ ఆటగాళ్లను ఆడించడంలో తప్పులేదు. కానీ.. అదే సమయంలో మ్యాచ్‌లను మలుపు తిప్పే ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యమున్న సీనియర్లనూ విస్మరించకూడదు' అని హర్భజన్ సింగ్.. టీమ్ఇండియా యాజమాన్యానికి సూచించాడు. 'గత వరల్డ్ కప్‌లోనూ టీమ్ఇండియా ఫైనల్‌లో ఓడిపోయింది. పిచ్ చాలా స్లోగా ఉండటమే దీనికి కారణం. మంచి పిచ్ మీద గనక ఆడిఉంటే.. ఫలితం మరోలా ఉండేది. ఆస్ట్రేలియా ఒత్తిడిలోనూ బాగా ఆడింది. అందుకే టీమ్ఇండియాపై విజయం సాధించింది. అయితే రోహిత్‌శర్మ సారథ్యంలో భారత జట్టు అద్భుత ప్రదర్శనలు చేసింది. అందుకే మొదట రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను జట్టులోకి తీసుకున్నాకే, మిగతా ఆటగాళ్లను ఎంపిక చేయాలి' అని హర్భజన్ సింగ్ కుండ బద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# శ్రీలంకతో సిరీస్‌కు శ్రీచరణి, అరుంధతి



దిల్లీ: శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో తలపడే భారత మహిళల జట్టులో తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతి రెడ్డి ఆడనున్నారు. ఈ నెల 21న ఆరంభమయ్యే ఈ సిరీస్‌లో బరిలో దిగే జట్టును సెలక్టర్లు మంగళవారం ప్రకటించారు. భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా.. స్మృతి మంధాన వైస్ కెప్టెన్. ముంబయి వికెట్‌కీపర్ బ్యాటర్ కమలి ని, మధ్యప్రదేశ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ జట్టులో కొత్త ముఖాలు. షెఫాలి వర్మ కూడా ఈ టీమ్‌లో ఉంది. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు విశాఖపట్నంలో.. తర్వాతి మూడు తిరువనంతపురంలో జరుగుతాయి.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, జెమీమా, షెఫాలి, హర్లీన్ డియోల్, అమన్‌జ్యోత్, అరుంధతి రెడ్డి, శ్రీచరణి, క్రాంతి గౌడ్, రేణుక సింగ్, రిచా ఘోష్, కమలిని, వైష్ణవి శర్మ.




# 2030 నాటికి భారత్‌లో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## పది లక్షల ఉద్యోగాలు : అమెజాన్ ప్రకటన

2030 నాటికి భారత్‌లో వివిధ వ్యాపారాల్లో 35 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెడతామని ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ వెల్లడించింది. ఉపాధి కల్పన, వ్యాపార విస్తరణ కోసం ఈ ప్రణాళికలను ప్రకటించింది. దిల్లీలో జరిగిన అమెజాన్ సంభవ్ సమిట్‌లో ఈ ప్రకటన చేసింది. గత 15 ఏళ్లలో భారత్‌లో అమెజాన్ 40 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. భారతదేశ విస్తృత డిజిటల్, ఆర్థిక ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతి వృద్ధి, ఉద్యోగ సృష్టి లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని వెల్లడించింది. అమెజాన్ ఇప్పటివరకు 12 లక్షల వ్యాపారాలను డిజిటలైజ్ చేసిందని, 2024లో సుమారు 2.8 మిలియన్ల మందికి ప్రత్యక్ష, పరోక్ష, సీజనల్ ఉద్యోగాలు లభించాయని పేర్కొంది. 2030 నాటికి అదనంగా 10 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకుంది. "గత 15 ఏళ్లుగా భారత్ డిజిటల్ ప్రయాణంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. మా సంస్థ వృద్ధి.. భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్, వికసిత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. భారత్‌లో చిన్న వ్యాపారాలకు డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించడంలో, లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంలో, మేడ్ ఇన్ ఇండియాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లే దిశగా మేం భారీగా పెట్టుబడులు పెట్టాం" అని అమెజాన్‌లో ఎమర్జింగ్ మార్కెట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ అన్నారు. కొత్త పెట్టుబడుల గురించి ప్రకటన చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.




# లిస్టింగ్‌లో అదరగొట్టిన మీషో కంపెనీ..

## 46 శాతం ప్రీమియంతో అరంగేట్రం

సాఫ్ట్‌బ్యాంక్ మద్దతు కలిగిన ఇ-కామర్స్ సంస్థ మీషో షేర్లు లిస్టింగ్‌లో అదరగొట్టాయి. బుధవారం 46 శాతం ప్రీమియంతో దలాల్‌స్ట్రీట్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.111తో పోలిస్తే.. ఎన్ఎస్ఈలో రూ.162.5 వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. బీఎస్ఈలో రూ.161.2 లిస్ట్ అయ్యాయి. తర్వాత కూడా ఈ సంస్థ షేర్లు దూకుడు కొనసాగిస్తున్నాయి. ఉదయం 11 గంటల సమయంలో లిస్టింగ్ ధరతో పోలిస్తే.. 13 శాతం లాభపడ్డాయి. మీషో రూ.5,421 కోట్ల ఐపీఓ డిసెంబర్ 3 నుంచి 5 మధ్య సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చింది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.105–111గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ ఇన్‌ఫ్రా, మార్కెటింగ్, ఇన్ ఆర్గానిక్ గ్రోత్ పెంచుకోవడం, వ్యూహాత్మక అవసరాల కోసం కంపెనీ వినియోగించనుంది. మరోవైపు 12.9 శాతం ప్రీమియంతో కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ సంస్థ ఏక్వాస్ షేర్లు స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాయి. ఆ షేరు ఇష్యూ ధర రూ.124 కాగా.. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో రూ.140 వద్ద నమోదయ్యాయి. రూ.922 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ సంస్థ ఐపీఓకు వచ్చింది.



## అది చాలా కష్టమైన రోజు

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. ఇటీవల ఈ చిన్నది స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' మూవీలో నటించి మెప్పించింది. థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం ఓకే ఓకే అనిపించుకున్నప్పటికీ ఈ భామ యాక్టింగ్‌కు మాత్రం ఫుల్ మార్కులే పడ్డాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీలో నటిస్తోంది. దీనికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. ఈ క్రమంలో తాజాగా రాశీ పోస్ట్ చేసిన పోస్ట్ చేసిన స్టోరీ నెట్టింట చక్కర్లు కొడుతోంది. షేర్ చేసిన స్టోరీలో రాశీ సీరియస్‌గా ఏదో మూవీకు డబ్బింగ్ చేప్తుంది. ఇక డబ్బింగ్ స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న పిక్‌ను షేర్ చేస్తూ.. 'చాలా ఉత్తేజకరమైన దాని కోసం డబ్ చేసాను – త్వరలో వస్తుంది.. అయితే ఇది చాలా కష్టమైన రోజు' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. మరి దీన్ని చూసిన పవర్ స్టార్ ఫ్యాన్స్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకే డబ్బింగ్ చెబుతుందని కామెంట్స్ చేస్తున్నారు.

## ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్
# రెండో సీజన్ రెడీ

భారత స్వాతంత్య్ర పోరాటం, దేశ విభజన నాటి చారిత్రక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించిన ప్రముఖ వెబ్ సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' తన రెండో సీజన్‌తో రాబోతుంది. నిఖిల్ అద్వానీ దర్వకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ప్రముఖ రచయితలు డొమినిక్ లాపియర్, లారీ కాలిన్స్ రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' ఆధారంగా రాబోతుంది. తాజాగా ఈ దీనికి సంబంధించిన ట్రైలర్‌తో పాటు స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం విడుదల చేసింది. రెండో సీజన్‌ని జనవరి 9 నుంచి ప్రముఖ ఓటీటీ సోనిలివ్ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రెండో సీజన్ ట్రైలర్ చూస్తుంటే.. స్వాతంత్య్రం వచ్చిన వెంటనే దేశంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలను ఈ సిరీస్ ప్రస్తావించనుంది. స్వాతంత్య్రానంతరం భారత్ ఎదుర్కొన్న పెను సవాళ్లు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటంపై దృష్టి సారించింది. ముఖ్యంగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు అప్పటికింకా భారతదేశంలో భాగంగా లేని రాచరిక సంస్థానాలను ఏ విధంగా విలీనం చేశారు. అలాగే కీలకమైన కలకత్తాను పాకిస్థాన్‌లో కలపకుండా ఎలా అడ్డుకున్నారు. చారిత్రక నగరం అయిన లాహోర్‌ని ఎలా వదులుకున్నారు అనేది ఇందులో ఆసక్తికరంగా సాగింది. మొదటి సీజన్ భారీ విజయం అందుకున్న నేపథ్యంలో దేశ నిర్మాణంలో మన నాయకులు పడిన శ్రమను తెలుసుకోవాలనుకునే చరిత్ర అభిమానుల్లో సీజన్ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.




## త్రివిక్రమ్-వెంకటేశ్ కాంబో
# ఆదర్శ కుటుంబం టైటిల్ ఖరారు

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'హౌస్ నం47 ' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ సింపుల్‌లుక్‌లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.




## వారణాసిలో
# యుగయుగాల చరిత్ర
### ఐదు అవతారాల్లో కనిపించనున్న మహేశ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది. చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్‌లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు. ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్ఫియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది. స్ఫియర్ బాల్‌పై మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు నెట్టింట్లో వేగంగా స్ప్రెడ్ కావడంతో అందరు నిజమేనని నమ్మారు. కాని వాస్తవానికి అవి అసలు



నిజం కావని తర్వాత తేలింది. ఆ ఫుటేజ్, ఫోటోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమే అని పరిశీలనలో బయటపడింది. దీంతో చాలామంది అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్ఫియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లు, సినిమాలు అక్కడ తమ కంటెంట్‌ను ప్రదర్శిస్తున్న దృష్ట్యా, సరైన మొత్తాన్ని చెల్లిస్తే 'వారణాసి' టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రమోషన్ చేయవచ్చని ఇండస్టీ వర్గాలు భావిస్తున్నాయి.



## సినిమా నిర్మాణం ఎవరి ఇష్టం వారిదే
### అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ

సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. 'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.


## అఖండ-2 విడుదలతో
# పలు సినిమాలు వాయిదా



టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'అఖండ 2: తాండవం' 12 నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్‌టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి. ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల-సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం 'మోగ్లీ' ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన 'సైక్ సిద్దార్థ్' అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది. ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం 'శివాజీ' ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య-బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో 24గంటల్లోనే తేలనుంది.

## దుమ్మురేపుతున్న ముమ్ముట్టి సినిమా

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు. ఈ వీకెండ్ పెద్ద సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద లేకపోవడంతో ఈ చిత్రం మంచి కలెక్షన్లు రాబడుతుందని సమాచారం.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com